అడవిలో అసాంఘిక కార్యకలాపాలు

రొళ్ల మండలం జీబీ హళ్లి సమీపంలోని కొండ ప్రాంతంలో గత ఏడాది సెప్టెంబర్ నెలలో మడకశిర సర్కిల్ సిబ్బంది దాడి చేశారు. పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే గుడిబండ మండలం పూజారిపల్లి–హొట్టేబెట్ట సరిహద్దు ప్రాంతంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై దాడి చేశారు. 8 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు. కేసులు నమోదు చేసి మడకశిర కోర్టులో హాజరుపరిచారు.

- పేకాటకు అడ్డాగా మారిన అటవీ ప్రాంతం
- రెచ్చిపోతున్న మందుబాబులు
- వనమూలికల పేరుతో రిజర్వ్ ఫారెస్ట్‌లోకి ప్రవేశిస్తున్న ఆకతాయిలు
- చోద్యం చూస్తున్న అటవీ, పోలీస్ శాఖ అధికారులు


కొడగార్లగుట్ట సమీపంలోని అటవీ ప్రాంతంలో పడేసిన మద్యం బాటిళ్లు


చెట్లకు ఆకతాయిలు నిప్పు పెట్టిన దృశ్యం (ఫైల్)

రొళ్ల: ఉమ్మడి అనంతపురం జిల్లాలో పూర్తిగా వెనుకబడిన ప్రాంతం మడకశిర నియోజకవర్గం. ఇది పూర్తిగా కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా సరిహద్దులో ఉంది. ఈ నియోజకవర్గంలో మడకశిర మండలం మినహా మిగిలిన నాలుగు మండలాల్లో ఎక్కువగా శాతం ప్రజలు కన్నడ భాషలో మాట్లాడుకోవడం విశేషం. అగళి, అమరాపురం మండలాలు మినహా.. మిగిలిన రొళ్ల, గుడిబండ, మడకశిర మండలాలు రిజర్వ్ ఫారెస్ట్‌కు ఆనుకుని ఉన్నాయి. మడకశిర నుంచి గుడిబండ, రొళ్ల నుంచి మడకశిరకు వెళ్లే రోడ్డు మార్గంలోని అటవీ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పేకాట, వ్యభిచారం, మందుబాబుల పార్టీలు ఈ ప్రాంతాల్లో జోరుగా సాగుతున్నట్లు సమాచారం. గుడిబండ మండలం నుంచి మడకశిరకు వెళ్లే ప్రధాన రోడ్డు మధ్యలో కనుమ భూతప్ప స్వామి ఆలయం, రొళ్ల మండలం నుంచి మడకశిరకు వెళ్లే రోడ్డులో కొడగార్లగుట్ట సమీపంలో టీడీపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన వీరజిన్న రాయప్పస్వామి ఆలయం ఉన్నాయి. ఈ ప్రాంతంలో ప్రజల సంచారం అధికంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

జోరుగా పేకాట

తాలూకాలోని రొళ్ల, మల్లినమడుగు, హెచ్.టీ.హళ్లి, కాకి, దొడ్డేరి, పిల్లిగుండ్ల, కె.బ్యాడిగెర, జీ.బీ.హళ్లి, చిగమతిఘట్ట, సోమఘట్ట, ఎం.రాయాపురం, రాళ్లపల్లి, గుడిబండ, హిరేతుర్పి, జంబులబండ, కల్లురొప్పం, ముదుకూరు, ఇటికేపల్లి, ఎస్.ఎస్.గుండ్లు, బేగార్లపల్లి, కదిరేపల్లి, మడకశిర, గుర్రపుకొండ, నాచేపల్లి, మోరబాగిల్ తదితర ప్రాంతాల నుంచి పేకాటరాయుళ్లు జోరుగా మొబైల్ గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇక శని, ఆదివారాల్లో మందుబాబుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. దీనికి తోడు ఆకతాయిల చేష్టలతో అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతవుతోంది. వందలాది ఎకరాల్లోని చెట్లు బూడిద పాలవుతున్నాయి. అటవీ ప్రాంతాల్లో అపరిచితుల సంచారం కూడా అధికమైనట్లు స్థానికులు చెబుతున్నారు. కొంత మంది వన్య ప్రాణులు, వనమూలికల కోసం అడవికి నిప్పు పెడుతున్నారు. అటవీ ప్రాంతాల్లో పేకాట, వ్యభిచారం జరుగుతున్నా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంలో పోలీసులు, అటవీ శాఖ అధికారులు విఫలమవుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

నిఘా పెంచాం..

వన్యప్రాణులు, అటవీ ప్రాంతాన్ని సంరక్షించుకునేందుకు చర్యలు తీసుకుంటాం. అటవీ ప్రాంతాల్లో నిఘా పెంచాం. ఈ మధ్య కాలంలో కొడగార్లగుట్ట సమీపంలో రిజర్వ్ ఫారెస్ట్‌లో అపరిచితుల సంచారం, మందుబాబుల ఆగడాలు, వ్యభిచారం ఎక్కువైనట్లు మాకు సమాచారం అందింది. అలాంటి వారు ఎవరైనా కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. అటవికి నిప్పు పెడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– కుళ్లాయప్ప, ఇన్‌చార్జ్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, రొళ్ల మండలం

క్లుప్తంగా

మామిడి తోటకు నిప్పు


మంటలను అదుపు చేస్తున్న దృశ్యం

పావగడ: గుర్తు తెలియని ఆకతాయిలు బీడు భూమిలోని ఎండు గడ్డికి నిప్పు పెట్టారు. ఈ మంటలు వ్యాపించి సమీపంలోని రైతు రఘునాథరెడ్డికి చెందిన మామిడి తోట దగ్ధమైన సంఘటన శనివారం సాయంత్రం ఓబళాపురంలో చోటుచేసుకుంది. వివరాలు.. రైతు రఘునాథరెడ్డి మామిడి తోటను సాగు చేశాడు. నీటి కొరతతో డ్రిప్ సెట్ ఏర్పాటు చేసుకుని బిందు సేద్యం పద్ధతిలో తోటను కాపాడుకుంటూ వస్తున్నాడు. సుమారు రూ.2 లక్షల వరకు తోట సాగుకు ఖర్చు పెట్టాడు. శనివారం ఆకతాయిలు నిప్పు పెట్టడంతో అగ్ని మాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో నష్టం తప్పింది. అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతు రఘునాథరెడ్డి కోరుతున్నాడు.

జేజేఎం బిల్లులు చెల్లించాలి


ఆందోళన చేస్తున్న కాంట్రాక్టర్లు

పావగడ: తాలూకా వ్యాప్తంగా జేజేఎం (జల జీవన్ మిషన్) పథకం కింద పైప్‌లైన్ పనులు పూర్తి చేసినప్పటికీ బిల్లులు చెల్లించడం లేదు. 6 నెలలుగా ఎలాంటి ఫైనల్ బిల్లులు ఇవ్వకుండా సతాయిస్తున్నారని స్థానిక తాలూకా కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి ఆరోపించారు. శనివారం స్థానిక అతిథి గృహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సంబంధిత శాఖల ఇంజనీర్ల వైఖరిపై మండిపడ్డారు. ఇలాగే నిర్లక్ష్య వైఖరి కొనసాగిస్తే పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి లోకేశ్, గంగప్ప, పాలనాయక్, తిమ్మయ్య, దివాకర్, ఈరారెడ్డి, భాస్కర్ నాయుడు, బ్రహ్మానందరెడ్డి, పోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు


ఖైదీల వివరాలు తెలుసుకుంటున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్

హిందూపురం అర్బన్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్ తెలిపారు. శనివారం స్థానిక ఉప కారాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఏయే నేరాలు చేసి జైలుకు వచ్చారు? నేరాలు ఎందుకు చేయాల్సి వచ్చింది తదితర వివరాలను ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని ఖైదీలు నేరుగా తమకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటిని పరిశీలించి ఉచిత న్యాయ సహాయం అందించేందుకు న్యాయస్థానాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం ఉప కారాగారంలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఉప ఖారాగార అధికారి హనుమప్ప, న్యాయవాదులు సదాశివరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, నవేరా, భాగ్య, పారా లీగల్ వలంటీర్ సురేష్, లోక్ అదాలత్ శారద పాల్గొన్నారు.

చదువుపై దృష్టి సారిస్తే విజయం తథ్యం


మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్ నాయుడు

హిందూపురం అర్బన్: విద్యార్థులు చదువుపై దృష్టి సారించి చదివితే విజయం సాధించవచ్చని ఒకటో పట్టణ సీఐ రాజగోపాల్ నాయుడు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని దండురోడ్డులో ఉన్న హైస్కూల్ విద్యార్థులకు పదో పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్నాళ్లు మొబైల్‌కు దూరంగా ఉండి అన్ని సబ్జెక్టులు చదవాలన్నారు. త్వరలోనే పరీక్షలు వస్తున్నాయని.. పరీక్షలు బాగా రాయాలంటే సబ్జెక్టులపై పట్టు సాధించాలని సూచించారు. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు.

గుడిబండ: ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలని ఎంజేపీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ ఇంటర్ విద్యార్థులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంజేపీ కళాశాలలో అమ్మా, నాన్నకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పట్టుదలతో చదివి ఉత్తమ మార్కులు సాధించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు కళాశాలకు వస్తువులు అందజేశారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి


ఏఓకు వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పెనుకొండ రూరల్: రాష్ట్ర బడ్జెట్‌లో రాయలసీమకు 42 శాతం నిధులు కేటాయించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్డీఓ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని కోరారు. సీమలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నెలకొల్పిన ప్రభుత్వ రంగ సంస్థలు అమరావతికి తరలిపోకుండా చూడాలన్నారు. గుంతకల్లు రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. కడప ఉక్కు పరిశ్రమను ప్రభుత్వమే నడపాలని సూచించారు. హంద్రీ–నీవా లైనింగ్ పనులు నిలిపి వేసి, కాలువ సామర్థ్యం పెంచాలన్నారు. వలసలు అరికట్టటానికి ప్రత్యేక కమీషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ రాజశేఖర్, లెక్చరర్ దేవిశెట్టి రామన్న, సీఐటీయూ రమేష్, సీపీఐ శ్రీరాములు, కళాకారులు కోగిర జయ చంద్ర తదితులు పాల్గొన్నారు.

స్పిన్నింగ్ మిల్లును కాపాడుకుందాం


వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, మిల్లు కార్మికులు

పరిగి: కొడిగెనహళ్లి ప్రీకాట్ స్పిన్నింగ్ మిల్లు మూతపడకుండా కాపాడుకుందామని సీఐటీయూ కార్మికవర్గ నాయకులు, ఆ శాఖ జిల్లా జనరల్ సెక్రెటరీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1983లో ప్రీకాట్ స్పిన్నింగ్ మిల్లు స్థాపించినప్పటి నుంచి కొన్ని వేల కుటుంబాలను కాపాడిందన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి లభించిందని తెలిపారు. యాజమాన్యం అవలంభిస్తున్న వైఖరి, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు, ముడి సరుకును వెనక్కి పంపడం, నోవర్క్ నోపే అంటూ బోర్డులు పెట్టడంతో ప్రీకాట్ స్పిన్నింగ్ మిల్లు నిర్వహణపై అనుమానం వస్తోందన్నారు. కార్మికుల ఆవేదనను యాజమాన్యానికి తెలియజేసి, మిల్లు మూసి వేయకుండా చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ రెడ్డి, ట్రెజరర్ నందీశ్వర్, మిల్లు కార్మికులు పాల్గొన్నారు.

నేడు మహాకుంభ మేళా స్నానాలు


కరపత్రాలను విడుదల చేస్తున్న బీజేవీపీఎస్ నాయకులు

పెనుకొండ: పట్టణంలోని భోగసముద్రం చెరువులో ఆదివారం మహాకుంభ మేళా స్నానాలు చేయించడం జరుగుతుందని భోగజముద్రం జలవనరుల పరిరక్షణ సమితి నాయకులు పాపానాయుడు, రమేష్, రాజశేఖరరెడ్డి తదితరులు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. గంగా, యమున, సరస్వతి నదుల పుణ్య జలాలను ప్రయాగ్‌రాజ్ పుణ్యక్షేత్రం నుంచి తీసుకురావడం జరిగిందన్నారు. పట్టణంలో ఊరివాకిలి ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఉదయం 9 గంటలకు జలాలను ఊరేగింపుగా భోగసముద్రం చెరువు వద్దకు తీసుకురావడం జరుగుతుందన్నారు. అక్కడ శివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అభిషేకం నీటిని భోగసముద్రం చెరువులో కలుపుతామన్నారు. అనంతరం స్నానాలు చేసేందుకు భక్తులను అనుమతిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళి, శివరాం, వినోద్ కుమార్, రాము, రవి కుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి వేడుకలు విజయవంతం చేయండి

భోగసముద్రం చెరువులో వెలసిన మహాధ్యాన యోగేశ్వర మూర్తి (శివుడు) వద్ద జరిగే మహాశివరాత్రి వేడుకలను విజయవంతం చేయాలని బీజేవీపీఎస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈనెల 25, 26 తేదీల్లో శివరాత్రి వేడుకలు జరుగుతాయన్నారు. 26వ తేదీ రాత్రి జరిగే కాంతారా కేరళ వాయిద్యం చూడముచ్చటగా ఉంటుందని తెలిపారు.

కరుణించు.. సరస్వతీ దేవి


గోరంట్ల: గిరిజన సంక్షేమ పాఠశాలలో సరస్వతి పూజ


అమరాపురం: సరస్వతి పూజ చేస్తున్న అర్చకుడు

గోరంట్ల: స్థానిక గిరిజన బాలికల సంక్షేమ పాఠశాలలో శనివారం సరస్వతీ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గోపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యంతో చదివి పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో సౌతాఫ్రికాకు చెందిన నవనీత్ నాయకర్, ప్రముఖ న్యాయవాది, జూతూరు ప్రతాప్‌రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నరేంద్ర, పాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమార్ పాల్గొన్నారు.

అమరాపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ విద్యార్థులు సరస్వతీ పూజ చేశారు. అర్చకుడు హరీష్ భట్టాచార్యులు సరస్వతి చిత్రపటాన్ని అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన చేపట్టారు. విద్యార్థులతో సరస్వతి మంత్రాన్ని పఠనం చేయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ నాయక్, జగన్నాథ్ మాట్లాడుతూ.. విద్యార్థులు గతంలో చదివిన అంశాలను రివిజన్ చేసుకోవాలని సూచించారు. ప్రశ్నపత్రాన్ని బాగా చదివిన అనంతరం సమాధానాలు రాయాలన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


నమూనాలను వివరిస్తున్న విద్యార్థులు

పరిగి: మండల కేంద్రంలోని అమర్ విద్యామందిరంలో శనివారం వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థులు వివిధ నమూనాలను ప్రదర్శించారు. రోబోటిక్స్, ఏవస్ ఫెస్ట్–2025, స్మార్ట్ డస్ట్‌బిన్, స్మార్ట్ టోల్ గేట్, మార్స్ రోవర్, ఫుట్‌బాల్ డ్రోన్, సెల్ఫ్ డ్రైవింగ్ కార్, మానవ ఆధారిత నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం ముఖ్య అతిథులుగా హాజరై, నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో అమర్ విద్యామందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు అమానుల్లా, కరస్పాండెంట్ సయ్యద్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత


హాజరైన విద్యార్థులు

మడకశిరరూరల్: మండలంలోని గుండుమల కేజీబీవీలో శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ భాస్కర్ మాట్లాడుతూ.. విద్యార్థులు మాతృభాషపై మక్కువ పెంచుకోవాలన్నారు. మాతృభాషా ప్రాముఖ్యతను వివరించారు. మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. పదో తరగతి విద్యార్థినులు సమయాన్ని వృథా చేయకుండా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివన్న, కరియన్న, గంగులప్ప, దేవరాజు, బాలరాజు, శ్రావణి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు

రొళ్ల/అమరాపురం/గోరంట్ల: జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా శనివారం రొళ్ల, అమరాపురం, గోరంట్ల మండలాల్లో అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. చిన్నారులకు ఆట పాటలతో విద్యను నేర్పడానికి అంగనవాడీ వర్కర్లు శ్రద్ధ తీసుకోవాలని రిసోర్స్‌పర్సన్లు సూచించారు. తల్లిదండ్రులతో తరచుగా సమావేశాలు నిర్వహించి అంగనవాడీల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమంలో రొళ్ల ఎంఈఓ శ్రీధర్, గోరంట్ల ఎంఈఓ గోపాల్, ఆర్పీలు యంజేరప్ప, యువరాజు, జగదీష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రజిత, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్టార్టర్ చోరీ

అగళి: తోణసనపల్లి గ్రామంలో రామపురం రోడ్డు పక్కన ఉన్న తాగునీటి మోటార్‌కు ఏర్పాటు చేసిన స్టార్టర్‌ను శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. సర్పంచ్ మంజమ్మ, పంచాయతీ కార్యదర్శి రంగనాథ, గ్రామ ప్రజలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు నెలల క్రితం కూడా గుర్తు తెలియని వ్యక్తులు స్టార్టర్‌ను దొంగిలించినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం

పెనుకొండ రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత ఈనెల 6వ తేదీన అదృశ్యమైంది. బంధువులు, ఇతర ప్రాంతాల్లో కుటుంబ సభ్యులు వెతికినా ఆమెకీ లభ్యం కాలేదు. శనివారం వివాహిత తండ్రి కియా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కియా ఎస్ఐ రాజేష్ తెలిపారు.

సీసీ కెమెరాలతో భద్రత

హిందూపురం అర్బన్: హిందూపురంలో రోజు రోజుకు చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇళ్లు, దుకాణాలు, వాణిజ్య సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. శనివారం ఆటోల్లో మైకులు ఏర్పాటు చేసుకుని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెండవ పట్టణ ఇన్‌చార్జ్ సీఐ జనార్దన్, ఎస్ఐ ఆజాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి దేవాలయానికి 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఈఈ వెంకటేశులు మాట్లాడుతూ.. ఆలయాన్ని వచ్చే వీఐపీలు, పర్యాటకులను దృష్టిలో ఉంచుకుని నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఇందుకోసమే ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్, లైన్‌మెన్ షామిద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరపాలి

పావగడ: పి.రొప్ప గ్రామంలో పంచాయతీ అధ్యక్షురాలి ప్రోద్బలంతో గ్రామ పంచాయతీ పీడీఓ విజయకుమార్ అవినీతికి పాల్పడ్డారని అదే గ్రామ పంచాయతీ సభ్యుడు గోరసమావు హనుమంతరాయప్ప ఆరోపించారు. గత నాలుగు రోజులుగా ఆయన ధర్నా చేస్తున్న విషయం తెలిసిందే. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విద్యుత్ పరికరాల కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయన్నారు. ఓచర్లు, బిల్లులు చూపించమంటే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని తెలిపారు. వెంటనే పీడీఓ విజయకుమార్‌పై చర్యలు తీసుకోవాలని టీపీఎస్ ఈఓ జానకిరాంను కోరారు. అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మడకశిర: ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ రాజ్‌కుమార్ సూచించారు. శనివారం పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. రోడ్డు నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని కోరారు.

చెత్త సేకరణకు ప్రత్యేక డ్రైవ్

గుడిబండ: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శనివారం చెత్త సేకరణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. శని, ఆదివారాల్లో తప్పనిసరిగా ఇంటింటా చెత్త సేకరించాలని పంచాయతీ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులకు ఈఓఆర్డీ నాగరాజు నాయక్ సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుణాకర్ గౌడు, కార్యదర్శి ప్రకాష్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

అగళి: పంచాయతీలను చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు పరిశుభ్రతను పాటించాలని సర్పంచులు శివకుమార్, రామకృష్ణప్ప, సరసమ్మ, పంచాయతీ కార్యదర్శి పాణీ సూచించారు. శనివారం మాధుడి, హెచ్‌డీ హళ్లి, పి.బ్యాడగేర పంచాయతీల్లో తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు.

ఘనంగా ప్రపంచ స్కౌట్ దినోత్సవం


లార్డ్ బాడెన్‌-పావెల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

లేపాక్షి: మండలంలోని పులమతి పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రపంచ స్కౌట్, ఆలోచనా దినోత్సవం నిర్వహించారు. స్కౌట్ ఉద్యమ పితామహుడు లార్డ్ రాబర్ట్ బాడెన్–పావెల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రపంచంలోని యువతను ప్రేరేపించి వారిలో చైతన్యం తీసుకొస్తామని ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు పేర్కొన్నారు. పర్యావరణం, విద్య, లింగ సమానత్వం, సామాజిక సమస్యలపై పిల్లలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్కౌట్, గైడ్ విద్యార్థులు, స్కౌట్ మాస్టర్ అశ్వర్థ నారాయణ, గైడ్ కెప్టెన్ రోజ్‌మేర్సీరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు


హోమంలో పాల్గొన్న టీఎన్.దీపిక, తదితరులు

చిలమత్తూరు: హిందూపురం రూరల్ మండలం సి.చెర్లోపల్లిలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం గర్భాలయ సంప్రోక్షణ, శిఖర కలశ ప్రతిష్ట, హోమం నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపికకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆమెను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మి, నాయకులు అశ్వర్థనారాయణ రెడ్డి, మహేష్ గౌడ్, మాజీ మండల కన్వీనర్ నక్కలపల్లి శ్రీరామిరెడ్డి, ధనుంజయ రెడ్డి, జిల్లా కార్యదర్శి గిరి, మహేంద్రరెడ్డి, వేణుగోపాల్ యాదవ్, రామకృష్ణా రెడ్డి, శ్రీరాములు, నర్సిరెడ్డి, కృష్ణారెడ్డి, కవితారెడ్డి, శబరీష్ రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సిద్ధ గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైన్స్ దినోత్సవం


సైన్స్ దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

పావగడ: తాలూకాలోని అరసికెరె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. దొడ్డబాణగెరె, తాలూకాలోని ఎస్ఆర్ పాళ్య ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు 101 మంది విద్యార్థులు వివిధ వైజ్ఞానిక నమూనాలను ప్రదర్శించారు. తొలుత రసాయన ఊసరవెల్లి, నీటిలో వైజ్ఞానికంగా తేలే అగ్ని ప్రయోగం నిర్వహించారు. అరసికెరె పాఠశాల సైన్స్ టీచర్ రేణుకారాజ్ మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్ఎంలు, సైన్స్ టీచర్లు పాల్గొన్నారు.

చేప పిల్లల ఉత్పత్తితో మత్స్యకారులకు ఉపాధి


రొద్దం పెద్ద చెరువులోకి చేప పిల్లలను వదులుతున్న మంత్రి సవిత

రొద్దం: ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన (పీఎంఎస్‌వై) పథకం ద్వారా శనివారం మండలంలోని రొద్దం పెద్ద చెరువులోకి లక్ష చేప పిల్లలను వదిలినట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళీ శాఖ మంత్రి సవిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మత్స్యకార సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను సరఫరా చేసిందన్నారు. చేప పిల్లల ఉత్పత్తితో మత్స్యకార కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. మూడు లేదా నాలుగు నెలల్లో చేప పిల్లలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు చెన్నకేశవ, మాజీ సర్పంచ్ అశ్వర్థనారాయణ, అధికారులు, చెరువు ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించం

లేపాక్షి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఎఫ్‌పీ షాపు డీలర్లు, ఎండీ ఆపరేటర్లతో తహసీల్దార్ సౌజన్యలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్‌డీటీ మోహన్‌నాయక్ మాట్లాడుతూ.. డీలర్లు, ఎండీ ఆపరేటర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. వినియోగదారులకు సకాలంలో సరకులు పంపిణీ చేయాలని తెలిపారు. బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గోరంట్ల: చౌకదుకాణాల ద్వారా పేదలకు నిత్యావసరాలను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ మారుతి ప్రసాద్ ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మండలంలోని చౌకధాన్యపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. సరుకుల పంపిణీలో డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీలర్లు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.